క్లుప్తంగా

ఘనంగా రామానుజన్ జయంతి..



బాపట్ల అర్బన్: స్థానిక బాపట్ల పబ్లిక్ స్కూల్ ఆవరణలో శనివారం ఘనంగా రామానుజన్ డే వేడుకలు నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు పి.సుబ్బరామయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, మోడల్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. రామానుజన్ నంబరుగా పిలవబడే 1729 రూపంలో 600 మంది విద్యార్థులను కూర్చోబెట్టి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీఎస్ రఘురాం, ఉపాధ్యాయులు పీబీ శర్మ, అన్వర్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



రేపల్లె రూరల్: పట్టణంలోని 27వ వార్డులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన షేక్ జిలాని, షేక్ జానీలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ బ్రాంచ్ శుక్రవారం చేయూతనందించింది. బాధితులకు రెడ్‌క్రాస్ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీర రాఘవయ్య వంట సామగ్రి, టార్పాలిన్ పట్టలు, హైజెనిక్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కరిముల్లా, ప్రభాకర్, బ్లడ్ బ్యాంక్ మిషన్ టెక్నీషియన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో లాభాలు



బాపట్ల: చిరు ధాన్యాల ఉత్పత్తులతో లాభాలతో పాటు పోషక విలువలు పొందవచ్చని ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల అధ్యాపకుడు డాక్టరు సీహెచ్ సోమేశ్వరరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా కళాశాలలో గ్రామ వికాస్ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టరు సోమేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను తెలుసుకోవాలన్నారు. కొన్ని పదార్థాల తయారీ గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు విమల బీర, ఫౌండేషన్ అధ్యక్షుడు జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలను తెలుసుకోవాలి



బాపట్ల: వినియోగదారుల చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వినియోగదారుల ఫోరం నాయకుడు డాక్టరు పి.సి.సాయి బాబు అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-కామర్స్, డిజిటల్ వర్తకం వంటివి వినియోగదారులు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఇ.బి.విలియమ్స్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి దేవరాజ్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఐజాక్, సేల్స్ ఆఫీసర్ విజయసారథి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి



ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతున్న సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

కూచిపూడి (వేమూరు): నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాలని పార్టీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. కూచిపూడి గ్రామంలో అర్‌అండ్‌బీ గేస్ట్ హౌస్‌లో కొల్లూరు మండల ఎంపీపీ, జెడ్పీటీసీలు గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జేఏసీ కన్వీనర్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. మండల స్థాయి నాయకులందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలని చెప్పారు. ప్రతి గ్రామంలో సర్పంచ్‌కు పూర్తి అధికారాలు ఇచ్చారు. మండల స్థాయిలో ఎంపీపీ, జెడ్పీటీసీలకు అధికారాలు ఇవ్వడం జరిగిందన్నారు. పార్టీ కార్యక్రమాలపై మండల కన్వీనర్లకు బాధ్యతలు అప్పగించారు. మండల స్థాయిలోని నాయకులందరూ పార్టీకి గెలుపునకు నిరంతరం పని చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సూర్యదేవర రామకృష్ణ, ఉప్పు శ్రీనివాసరరావు, పెరికల పద్మారావు, మురాల రాంబాబు, జేఏసీ కన్వీనర్ సుబ్బారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం



రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి



అల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

భట్టిప్రోలు: సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం ఉదయం 5 గంటలకు ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు ధారా నాయణమూర్తి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు స్వామి మూలవిరాట్‌లకు పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భట్టిప్రోలులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ ఉత్తర ద్వార దర్శనంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా శుక్రవారం తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో..

పిట్టలవానిపాలెం: అల్లూరు గ్రామంలోని శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకటశివారెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆలయంలో ఈ నెల 15 నుంచి ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 16వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఆఖరి రోజు స్వామివారి తెప్పోత్సవం నిజాంపట్నం-తెనాలి పంట కాలువలో అల్లూరు రెడ్లపాలెం నుంచి నిజాంపట్నం లాకుల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు

ఐలవరం(భట్టిప్రోలు): ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఐలవరంలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, తిరుమంజనం నిర్వహించారు. శనివారం దేవస్థానంలోని సీతారామ మందిరంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసి, గ్రామోత్సవం కావించనున్నట్లు బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. నగర సంకీర్తనలో సీహెచ్ సత్యన్నారాయణ, కేఎస్ ప్రసాద్, డి.వెంకటేశ్వరరావు, జె.సాంబశివరావు, కేబీవీ రమణ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేదలకు వరం



స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నరేంద్ర

అమర్తలూరు(వేమూరు): మధ్య తరగతి ప్రజలకు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం వరం లాంటిదని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. మండల కేంద్రంలో గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం పరిధిలో 900 మందికి ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు చికిత్స ఖర్చు రూ.25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము, డాక్టర్ ఏసుబాబు, పంచాయతీ కార్యకార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

నేడు సాధన మండలిలో గీతా జయంతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో శనివారం ఆశ్రమ 49వ వార్షికోత్సవం, గీతా జయంతి మహోత్సవం, 24న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీమద్భగవద్గీత పారాయణ, కర్పూర యజ్ఞం జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు అక్కివారిపాలెంలో క్రిస్మస్ ఆరాధన

భట్టిప్రోలు: పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని అక్కివారిపాలెంలో ప్రత్యక్షత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్రిస్మస్ ఆరాధన జరుగుతుందని నిర్వాహకులు ఎస్. గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని 50 మంది విద్యార్థులకు, 100 మంది సంఘ సభ్యులకు నూతన వస్త్రాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రజా ప్రతినిధులతో సమావేశం

కూచిపూడి(వేమూరు): మండల స్థాయి ప్రజా ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి ఇరిగేషన్ గేస్ట హౌస్‌లో ఉదయం 10 గంటలకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, కన్వీనర్ హాజరు కావాలని తెలిపారు.

వాహనదారులకు రూ.48 వేల జరిమానా

తెనాలిరూరల్: సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న వారికి అధికారులు జరిమానా విధించారు. రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వాహన తనిఖీల ప్రత్యేక డ్రైవ్‌ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. చేబ్రోలు మండలంలోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల వద్ద నిర్వహించిన తనిఖీల్లో ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌బీ మధుసూదనరావు, చేబ్రోలు ఎస్ఐ ఆనంద్ ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 7 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. వాహనదారులకు రూ.48 వేలు జరిమానా విధించారు. వాహనదారులు అన్ని పత్రాలు కలిగి ఉండాలని, నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: అరవపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన బ్రేకర్ ఏర్పాటు నేపథ్యంలో శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెనుమూడి రహదారి, అరవపల్లి రోడ్డు, గురుకుల పాఠశాల, ఏకలవ్య బొమ్మ సెంటరు, రాజశ్రీ వక్కపొడి ఫ్యాక్టరీ వీధి, డొంకరోడ్డు, పండ్ల మార్కెట్ సెంటరులో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాల ధరించిన విద్యార్థులను ఇళ్లకు పంపిన హెడ్మాస్టర్

- పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగిన హిందూ సంఘాలు, మాలధారులు
- క్షమాపణ చెప్పిన ప్రధానోపాధ్యాయుడు
- చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ



లిఖిత పూర్వక క్షమాపణ ఇస్తున్న ప్రధానోపాధ్యాయుడు బషీర్ అహ్మద్

తెనాలి రూరల్: అయ్యప్ప మాలలు ధరించి దీక్షా వస్త్రాలతో పాఠశాలకు వచ్చిన విద్యార్థుల్ని మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎస్‌ఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బయటకు పంపించి వేసిన ఘటన వివాదాస్పదమైంది. గురువారం స్కూలుకు వచ్చిన విద్యార్థుల్ని యూనిఫాం లేదన్న కారణంతో హెచ్‌ఎం బషీర్ అహ్మద్ బయటకు పంపేయడంతో హిందూ సంఘాలు ఆందోళనకు దిగాయి. విశ్వ హిందూ పరిషత్, బీజేపీ నాయకులు మాల ధరించిన స్వాములతో కలసి రోడ్డుపై స్కూలు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. స్కూల్ హెచ్‌ఎం బషీర్ అహ్మద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ అక్కడకు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. అయ్యప్ప స్వాములు, శివ స్వాములు రోడ్డు మీదనే కూర్చుని భజనలు చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగించారు. మధ్యలో స్కూలు హెచ్‌ఎం సంజాయిషీ ఇచ్చే ప్రయత్నం చేసినప్పటికీ వారు విరమించలేదు. కొద్దిసేపటికి త్రీ టౌన్ సీఐ రమేష్ బాబు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకుడు పాటిబండ్ల రామకృష్ణ, విశ్వ హిందూ పరిషత్ నాయకుడు అవ్వారు శ్రీనివాసరావుతో చర్చించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో చివరికి ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నుంచి లిఖితపూర్వకంగా క్షమాపణ పత్రం తీసుకున్నారు. ఆందోళనలో బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ తమ సిబ్బందితో పాఠశాలకు వచ్చి పరిస్థితిని అదుపు చేశారు.

రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా

ప్రత్తిపాడు: రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిత్యం ప్రత్యేక నిఘా ఉంచాలని గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా అన్నారు. ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం డీఎస్పీ వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషనులోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, వాటి పురోగతికి తీసుకోవలసిన చర్యలపై సీఐ ఎం.వి. సుబ్బారావు, ఎస్ఐ డి. రవీంద్రబాబులతో చర్చించారు. పెండింగ్ కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓర్పుతో విని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించి ప్రజా జీవితానికి ఆటంకం కలిగించే వ్యక్తులను ఉపేక్షించవద్దని, ప్రత్తిపాడులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎస్ఐకు స్పష్టం చేశారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

ఉత్సాహంగా సైన్స్ ఎగ్జిబిషన్‌లు



ప్రాజెక్ట్‌ను ఎంపీపీ, ఎంఈఓలకు వివరిస్తున్న విద్యార్థులు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

భట్టిప్రోలు: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ స్థానిక విశ్వశాంతి హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ నీలం దేవరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఒక్కో హైస్కూల్ నుంచి వ్యక్తిగత, జట్టు విభాగాల్లో ప్రాజెక్ట్ నమూనాలు ప్రదర్శించారు. మండలం నుంచి 25 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వ్యక్తిగత విభాగంలో వెల్లటూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.నరేంద్ర ప్రదర్శించిన మంకీ గన్, జట్టు విభాగంలో విశ్వశాంతి హైస్కూల్ విద్యార్థులు ఎండీ సహిష్ట, రమ్యశ్రీ, సమీరా ప్రదర్శించిన బయో కెమిస్ట్రీ జిల్లా ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో మండల సైన్స్ కో-ఆర్డినేటర్ అంబటి జాకబ్, హెచ్‌ఎం ఫణి పార్థసారథి, ఆయా హైస్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 136వ జయంతిని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం. కె.అరుణకుమారి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యార్థులకు గణిత క్విజ్ నిర్వహించారు. గణిత సూత్రాలు, త్రికోణమితి, జామెంట్రీలకు చెందిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. క్విజ్ మాస్టర్లుగా కె. కుటుంబరావు, కె. శివరామకృష్ణ వ్యవహరించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మండల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో తోటలోని కోతులను తరిమేందుకు రూపొందించిన వైల్డ్ లైఫ్ సౌండింగ్ గన్ ప్రథమ స్థానం సాధించినందుకు కృషి చేసిన నరేంద్రను, సహకరించిన సన్నీని ఉపాధ్యాయులు అభినందించారు.

రామానుజన్ సేవలు చిరస్మరణీయం

రేపల్లె రూరల్: గణిత రంగానికి శ్రీనివాస రామానుజన్ సేవలు చిరస్మరణీయమని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ అన్నారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని స్కూల్లో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు గణిత ప్రాజెక్ట్‌లు, క్విజ్ పోటీలు నిర్వహించారు. శ్రీనివాసరామానుజన్ ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ కుర్రా మహేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

అమర్తలూరు(వేమూరు): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి హెచ్‌ఎం ఎం.రవి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ముగ్గులు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గణితంను ఉదహరిస్తూ వేసిన రంగువల్లులు ఆకట్టుకున్నాయి. గణిత ఉపాధ్యాయులు విజయలక్ష్మీ, భ్రమర సూర్యశ్రీ, జయ శ్రీ,, శ్రీ విద్య, ఆదినారాయణ, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి

పెరవలి(వేమూరు): పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ట్యాబ్‌లను సర్పంచ్ దాది వెంకటలక్ష్మీరాజ్యం పంపిణీ చేశారు. విద్యార్థులందరూ..ట్యాబ్ లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ప్రధానోపాధ్యాయలు డి.సరోజని, దాది సుబ్బారావు, శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

పేరలి(కర్లపాలెం): పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిన ట్యాబ్‌లను సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం అపర్ణ పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను వినియోగించుకుని చదువులో రాణించాలన్నారు. హెచ్‌ఎం అపర్ణ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచానికి ధీటుగా..సులభంగా పాఠాలు అర్థమయ్యేందుకు ట్యాబ్‌లు అందజేయటం అభినందనీయమన్నారు. అనంతరం గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని నిర్వహించారు. విద్యార్థులు పలు సైన్స్ ప్రయోగాల నమూనాలు ప్రదర్శించారు. పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ సలగల ధర్మేంద్ర, ఉపాధ్యాయులు నాగబసవయ్య, అర్లమ్మ, రమేష్, పీఈటీ తిరుపతిరావు పాల్గొన్నారు.

మానవాళికి అద్భుత సందేశం భగవద్గీత

గీతాజయంతి వేడుకల్లో స్వామి భాస్కరానంద సరస్వతి



తైత్తిరియోపనిషత్తు గ్రంథం ఆవిష్కరణ

తెనాలి: భగవద్గీత సమస్త మానవాళికి అద్భుత సందేశమని రుషీకేశ్‌లో గల స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి చెందిన స్వామి భాస్కరానంద సరస్వతి అన్నారు. అమ్మలాలన, నాన్న రక్షణ, గురువు శిక్షణ కలగలిపినదే గీత సారాంశమన్నారు. ఆత్మవిద్యానికేతన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని ఆడిటోరియంలో గీతాజయంతి వేడుకలను భక్తిపూర్వకంగా నిర్వహించారు. వందలాది విద్యార్థులు, ఉపాధ్యాయులు భగవద్గీత గ్రంథాన్ని దగ్గరుంచుకుని అందులోని 18 అధ్యాయాల్లోని శ్లోకాలకు భాస్కరానంద సరస్వతి ఇచ్చిన వివరణను పారాయణ చేశారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన జ్ఞానబోధ భగవద్గీత అని చెప్పారు. వివేక విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు మాట్లాడుతూ దేశ విదేశాల్లోని అనేక విశ్వవిద్యాలయాల్లో భగవద్గీతను ఒక సబ్జెక్టుగా బోధించటం, దానిపై పరిశోధనలు జరుగుతుండటం ఆ గ్రంథానికున్న ప్రాముఖ్యతను తెలియజేస్తుందని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులుగా రాజమహేంద్రవరం ధ్యానజగతి నుంచి వచ్చిన ఐ.లీలాసరస్వతి శోభాయాత్రను ప్రారంభించారు. తైత్తిరియోపనిషత్తు గ్రంథం ఆవిష్కరించారు.

క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయం



సెమీ క్రిస్మస్ వేడుకలలో కేకు కట్‌చేస్తున్న కైతేపల్లి షాలేమ్ రాజు

అమృతలూరు(భట్టిప్రోలు): క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి అనుసరణీయమని గ్రేస్ ఫౌండేషన్ చైర్మన్ కై తేపల్లి షాలేమ్ రాజు అన్నారు. అమృతలూరు మండలం మూల్పూరులోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. షాలేమ్ రాజు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరిని శాంతి మార్గంలో నడిపిస్తాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ ప్రేమ విందులో మూడు వేల మంది పాల్గొన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న షాలేమ్‌రాజుకు దేవుని ఆశీస్సులు ఉండాలని పాస్టర్లు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ టీమ్ సభ్యులు, సంఘ పెద్దలు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.